*International Journal of Linguistics and Computational Applications (IJLCA)*
*Volume 2, Issue 2, April - June 2015*
ISSN 2394-6385 (Print)
ISSN 2394-6393 (Online)

# బౌద్ధమత విశిష్టత - తెలుగు సాహిత్యం

Dr. Vistali Sankara Rao

*Assistant Professor, Department of Telugu*
*University of Madras,Chennai – 05*
*drvistali@gmail.com*

భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు యావత్ ప్రపంచానికే ఆదర్శనీయంగా నిలిచాయి. ఎందుకంటే భారతదేశంలో చట్టబద్ధంగా మరియు సంప్రదాయబద్ధంగా మతపరమైన భిన్నత్వం కలిగి ఉన్నా, తామంతా ఒక్కటేనని పరమత సహనం కలిగి సోదరభావంతో కలిసి మెలసి జీవించే విశిష్టత ఈ నేలలో పుట్టిన పౌరుల లక్షణంగా చెప్పవచ్చు. కనుక భారతదేశం వివిధ మత సంప్రదాయాలతో కూడుకున్న ఒక ఉమ్మడి కుటుంబంగా భావించవచ్చు. అంతేకాదు ఈ లక్షణమే ప్రపంచ దేశాలచరిత్రలో భారతదేశానికి ఓ ప్రత్యేకమైన గౌరవనీయమైన స్థానం కలిగేట్లు చేసింది.

మతపరంగా పరిశీలిస్తే ప్రపంచంలోని ప్రధాన మతాలుగా విలసిల్లుతున్న హిందూ మతం, జైనమతం, బౌద్ధమతం, సిక్కుమతాల పుట్టినిల్లు భారతదేశం. అంతేకాక భారతదేశంలో ఈ మతాల ప్రజలతోపాటు ఇస్లామ్‌మతం, క్రైస్తవ మతం, జోరాస్ట్రీయన్ ఇంకా అనేక మతాలకు సంబంధించిన ప్రజలు కలిసిమెలసి జీవిస్తున్నారు. ఈ మతాల విశిష్టతలను, వాటి ఆవశ్యకతలను తెలిపే విశిష్ట గ్రంథాలు ఉన్నాయి. వాటినే పవిత్ర మతగ్రంథాలు అని పిలుస్తున్నాం. ఈ పవిత్ర గ్రంథాల ఆధారంగా ఆయా ప్రజల జీవన విధానాలు, ఆచారవ్యవహారాలు, ఆహారపద్ధతులు మొదలైనవి రూపుదిద్దుకున్నాయి. అంటే ప్రతి మతానికి ఒక పవిత్ర గ్రంథం ఉంది. ఆ పవిత్ర గ్రంథాలననుసరించి ఆయామతాల విశిష్టతను నిరూపించబడుతున్నాయి.

ఏదిఏమైనా మానవుని జీవితం మీద ఈ పవిత్ర గ్రంథాల ప్రభావం ఎంతో ఉందని స్పష్టంగా తెలుస్తుంది. అంతేకాక సామాజిక వ్యవస్థను తీర్చిదిద్ది ఒక క్రమబద్ధమైన జీవన విధానానికి ఈ గ్రంథాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. కాబట్టి ప్రతి మతంలోను ఈ గ్రంథాల పట్ల ప్రజలు పవిత్రమైన విశ్వాసం, గౌరవంను కలిగి ఉంటారు. ఇలా ఎవరి మతానుసారం వారు జీవనం కొనసాగిస్తూ పరమతంపట్ల సహనంతో, సోదరభావంతో కలిసి జీవించడం భారతదేశం యొక్క విశిష్టతగా చెప్పవచ్చు.

భారతదేశంలో ఉన్న మతాలలో అన్ని మతాలకన్నా విలక్షణంగా కనిపిస్తున్న మతం బౌద్ధ మతం. ఇంకా చెప్పాలంటే భారతదేశంలో ఆవిర్భవించి, వికసించి, ఖండాంతరాలకు వ్యాప్తిచెంది భారతీయ తాత్త్వికతను, దార్శికతను ప్రపంచానికి తెలియజేసి, మన కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన మతం బౌద్ధ మతం. ఈ నేపథ్యంలో బౌద్ధ మతం యొక్క విశిష్టతను, తెలుగు సాహిత్యంలో దీని స్థానం మొదలైన అంశాలను పరిశీలిద్దాం.

## 1. బౌద్ధమతం విశిష్టత, లక్ష్యం

'అక్కోధేన జినే కోధం, అస్సాధుం సాధునాజినే
జినే కదరియం దానేన, సచ్చేన అలికవాదినమ్'

- అని ధమ్మపదం - (17-3)లో తెలియస్తుంది.

అంటే ప్రేమతో క్రోధాన్ని, మంచితో చెడును, దానముతో పిసినారి తనాన్ని, సత్యంతో అసత్యాన్ని జయించు అని దీని అర్థం.

ఈ శతాబ్దంలో ప్రపంచ శాంతిని, అహింసను ప్రభావం చేసి ప్రజల మేలుకొరకు పాటుపడి దేశ ప్రజలకు ఆదర్శనీయమైన వ్యక్తిగా నిలిచినవారు జాతిపిత మహాత్మాగాంధి. అయితే ఈ లక్షణాలతో పాటు మానవత్వమే ప్రధాన ద్యేయంగా 2600 సంవత్సరాలకు పూర్వమే మనదేశంలో ఒక ఉద్యమ రూపంలో స్థాపించి జాతిని జాగృతం చేసిన మానవతావాది గౌతమ బుద్ధుడు. సత్యం, అహింస ప్రధానలక్షణాలతో ప్రజలలో చైతన్యం కలిగించేందుకు ముందుకు సాగాడు.

బుద్ధం సరణం గచ్ఛామి
ధమ్మ సరణం గచ్ఛామి

సంఘం సరణం గచ్ఛామి
- అంటూ ముందుకు సాగాడు.

అంటే సర్వమానవ సంక్షేమం కోసం, మానవజాతిని దు:ఖం నుండి విముక్తి చేయడం కోసం సర్వసుఖాలను గడ్డిపోచలతో సహజంగా త్యజించి త్యాగం అంటే, ఇలా ఉండాలి? అని చేసి నిరూపించిన ఆచరణశీలి.

అంతులేని ధనరాశులతో పొందలేని ఆత్మజ్ఞానాన్ని అనంతమైన జ్ఞానసాగరంలో కేవలం ఒక్క బిందువుతోనే అపారంగా పొందవచ్చునని భోదించాడు. తాను ఏది బోధించాడో దాన్ని అక్షరాల ఆచరించాడు. ఆయన ఆలోచనలు మానవునికి ధర్మబద్ధమైన, హేతుబద్ధమైన, పవిత్రమైన జీవనానికి వెలుగు బాటలు పరిచాయి. ఆయన ఆలోచన వెలుగులో బౌద్ధమత కిరణంగా ప్రపంచంలో ప్రసరించాయి.

ఈ బౌద్ధమతానికి ఆధారం బుద్ధుని జీవితం, ధర్మం, సంఘం మొదలైనవి. బుద్ధుని ఉపదేశాలే త్రిపీటికాలు అంటారు. త్రిపీటము అంటే మూడు బుట్టలు. వీటిలో గురుశిష్యుల సిద్ధాంతం ఉంది. దమ్మపధం అనేది బుద్ధుని అనుసూములగు బౌద్ధులు చదివే చిన్న బౌద్ధమత గ్రంథం. 'బుద్ధుని జీవితాన్ని గురించి సుత్తానిపతము, పూర్వస్తుతము, దీపవంశ, మహ్వావంశ మొదలగు గ్రంథాలు తెలియజేస్తాయి.

అలాగే బౌద్ధమత సిద్ధాంతాలను తెలిపేగ్రంథాలను పరిశీలిస్తే త్రిపీటికాలు, మహావస్తు, లలితవిస్తారం, అశ్వఘోషుని బుద్ధచరితం, నిదనకద, అబి నిష్క్రమణ సూత్రం, జాతక కథలు, దీఘనికాయం మొదలైన సంస్కృత, ప్రాకృత గ్రంథాలు తెలియజేస్తాయి. గౌతమబుద్ధుని బోధనలను పరిశీలిస్తే

1. ప్రపంచము దు:ఖమయం, 2. దు:ఖమునకు కారణం కోరికలు, 3. దు:ఖమును అంతం చేయడానికి కోరికలను జయింపవలెను, 4. కోరికలను జయించుట అష్టాంగ మార్గాములను అవలంబించవలెను

ఈ కోణంలో బౌద్ధ మతాన్ని పరిశీలిస్తే బౌద్ధమతం ఒక ధార్మిక, లౌకిక మతంగా పేర్కొనవచ్చు.

బుద్ధుని బోధనలను పరిశీలిస్తే అన్నీ కూడా శాంతి కరుణలపైన ఆధారపడి వున్నట్లుగా కనిపిస్తుందేకాని పగద్వేషాల మీద కాదు. ఇంకా చెప్పాలంటే బౌద్ధం మానవున్ని ఆలోచింపజేసి తనలోని సామార్థ్యాన్ని గుర్తించేలా చేస్తుంది. మనిషిని సద్ధర్మ మార్గంలో ప్రవర్తింప జేయాలంటే ముందుగా మనసుకు శిక్షణ ఇవ్వాలని తెలియజేస్తుంది. అంతేకాదు బౌద్ధమతం లక్ష్యం ఓ ప్రత్యేకంగా ఉంటాయి. అవి ఇతర మతాల కంటే ఎంతో వ్యత్యాసంతో కనిపిస్తాయి. నిశితంగా పరిశీలిస్తే ఒక్క బౌద్ధం మినహా మిగిలిన మతాలన్ని గమ్యస్థానం దేవుడని తెలియజేస్తాయి. అయితే బౌద్ధం మావనవుణ్ణే కేంద్రంగా చేసుకొని ముందుకు సాగుతుంది.

మానవుడు సమస్త కోరికలను విడనాడి (దు:ఖాన్ని) తన గమ్యమేమిటో తెలుసుకోవడమే ముఖ్యమైన విధిగా సూచిస్తుంది. అంటే మానవుడు అనుసరించే ప్రతి పనికి మనసే కేంద్రస్థానమని స్పష్టం చేస్తుంది. ఆ మనసును సంస్కరించుకుంటే మంచి చెడులను తెలుసుకొని సద్ధర్మాన్ని అనుసరించగలడు అని ప్రభోదించాడు బుద్ధుడు. అప్పుడే మన ఆలోచనలు, మాటలు, చేతలు అన్ని సక్రమంగా ఉంటాయని భావిస్తాడు.

ఇలా ఒక స్థిరమైన, క్రమమైన సామాజిక వ్యవస్థను పెంపొందింపజేస్తుంది బౌద్ధం. స్వాతంత్ర్యం, సోదరభావం, సమతలనే మహోన్నతమైన సిద్ధాంతాలలో బుద్ధుని బోధనలు ప్రకాశించి పెనవేసుకుని ఉన్నాయి. మతమంటే మరేదోకాదు అన్ని ప్రాణుల పట్ల సానుభూతి కలిగి ఉండడమేనని అందరిని ప్రేమించడమే మానవత్వామని నిరూపించాడు. ఇలా బౌద్ధం మానవ సమస్యలకు ఎన్నిటినో తగిన పరిష్కారాన్ని సూచిస్తూ ప్రశాంత విప్లవంలా దేశంలో వ్యాపించింది. మతం అనేది నిద్రపుచ్చే మందుకాకూడదు. అది మానవుని సంపూర్ణ వికాసానికి దోహదం చేయవాలని భావించారు. ఇలా ప్రపంచంలో ధర్మమత స్థాపనచేయడంలో బుద్ధునిదే అగ్రస్థానం అని చెప్పవచ్చు.

ఈ బౌద్ధమంలోని ప్రత్యేకత ఏమిటంటే తాను దేవుడనని ఎప్పుడు చెప్పుకోలేదు. అవతార పురుషుడనని అనలేదు, అంతేకాక తన మార్గంలోకి రాని వారి కోసం ప్రత్యేకంగా మహిమలు కూడా ఏమీ చూపలేదు.

మానవ మాత్రునివలే తల్లిదండ్రులకు సహజంగా జన్మించి, సామాన్య మానవునిగా సగర్వంగా చెప్పుకున్నాడు. ఆయన అనుసరించిన ధర్మమే బౌద్ధధర్మం.

"పూర్వులు చెప్పారనికాని, పూర్వ గ్రంథాలలో ఉన్నాయనిగాని, దేనిని గుడ్డిగా అనుసరించడంకాక హేతువుతో ఆలోచించి సత్యాలను అన్వేషించాలని చెప్పే బౌద్ధం, నీకునీవే ఒక జ్యోతివై వెలుగుము" అంటుంది. - బుద్దస్ట్ సోగ్రటి ఆఫ్ ఇండియా

మనిషి కివ్వబడిన ఈ స్వేచ్ఛ బౌద్ధపట్ల ఒకనూతన ఉత్సాహాన్ని కలిగించింది ఈ ధర్మమే. మానవాళి సకల జాగ్రత్తను ఉర్రూతలూగించింది. ఇలా ఒక్కొక్కరి హృదయాలలో స్థిరత్వాన్ని స్థాపించుకున్న ధర్మం బౌద్ధమతం.

ఈ విధంగా ప్రపంచానికి ప్రేమను, కరుణ, అహింసలను మొట్టమొదటిగా అందించాన వారు గౌతమబుద్ధుడు. మూఢత్వానికి, అంధవిశ్వాసాలకు ఎదురు తిరిగి శాస్త్రీయ పద్ధతిలో ఆచరణ సాధ్యమైన విధానాలతో బౌద్ధ ధర్మాన్ని స్థాపించి బౌద్ధం ఒక జీవన విధానంగా కలిగి ఉండవలసిన ఆవశ్యకతను తెలిపాడు.

ఇలా గౌతమబుద్ధుడు మానవ ఇతిహాసంలో మహాత్ముడిగా ప్రథమ ప్రవక్తగా హేతువాదిగా, సామ్యవాదిగా, మావతావాదిగా అంతేకాక మహా తార్కికుడుగా, సాంఘిక విప్లవ కారుడుగా, సంఘసంస్కర్తగా ప్రజల హృదయాలలో నిలిచి వారిలో నిరంతరం చైతన్యం కలిగిస్తూనే ఉంటాడు.

### 2. బౌద్ధమతం - వ్యక్తులపై ప్రభావాలు

బౌద్ధమత సిద్ధాంతాలు ప్రపంచంలో ఎందరినో ఆకర్షించాయి. దీని జన్మస్థలం భారతదేశం అయినప్పటికీ విశ్వస్థాయి పొందింది. చివరకు భారతదేశంలో ఏదో నామమాత్రంగా ఉన్నా చైనా, జపాన్, కొరియా, టిబెట్, వియత్నాం, బర్మా, థాయ్‌లాండ్, కంబోడియా, లావోస్, శ్రీలంక మొదలైన దేశాలలో ఎంతో ఆదరణలో ఉంది. ఇక భారత దేశంలోను ఎందరినో ప్రభావితం చేసింది. వారిలో వివేకానందుడు, గాంధీజీ, రవీంద్రుడు, అంబేద్కర్ మొదలగువారు. అందులో ప్రధానంగా ఇద్దరు వ్యక్తులపై బౌద్ధమత ప్రభావం ఎలా ఉందో పరిశీలిద్దాం.

భారతదేశ చరిత్రలో మౌర్యవంశానికి ఒక విశిష్ట స్థానం ఉంది. ఈ వంశంవారు సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి దేశ సమైక్యతను చాలా వరకు సాధించారు. ఈ వంశానికి చెందిన వాడే అశోక చక్రవర్తి. ఈ చండ అశోకుడు కళింగ రాజ్యంపై జరిపిన యుద్ధంతో ఒక్కసారిగా తనలో సమూలమైన మార్పు చోటుచేసుకుంది. ఆ యుద్ధం తరువాత బౌద్ధాన్ని స్వీకరించాడు. అంతటి పరాక్రమవంతుడు ఇలా అహింసా వాదిగా ఎలా మారాడని గమనిస్తే ఆ యుద్ధ క్షేత్రంలో తునాతునకలైన మానవ కళేభరాలు, విడివడిన కాళ్ళు, చేతులు, మొండాలు, పుర్రెలు, రక్తపు టేరులు, కత్తులకు, బల్లెలకు గుచ్చుకుని వ్రేళ్లాడుతున్న తలలు, అవయవాల భయానక దృశ్యాలు, గుర్రాల డెక్కల చప్పుళ్ళు, పదాతి దళాల చప్పుళ్ళు, ఏనుగుల ఘీంకారాలు ఇలా ఇంకా ఎన్నో ఎన్నెన్నో దృశ్యాలు గజగజలాడించేస్తాయి. అటువంటి సంఘటనలు అశోకుని హింసావార్గం వదలి అహింసామార్గంవైపు పయనించాడు. ఇలా కళ్ళముందు జరిగిన సంఘనలతో చలించిపోయిన అశోకునికి బౌద్ధసిద్ధాంతాలు సేదతీర్చాయి. ఇలా బౌద్ధధర్మవ్యాప్తిలో అశోకునికి ఉన్న స్థానం మరెవరికి లేదని చెప్పవచ్చు. ఇలా అశోకుడు బౌద్ధ మతం స్వీకరించి, ధర్మ సేవలో సేద తీరాడు. అహింస, పెద్దలపట్ల గౌరవం, తల్లిదండ్రులపట్ల భక్తి సేవతత్పరతలు సకల ప్రాణులపట్ల కరుణ, మానవత్వానికి గీటురాయి అని బౌద్ధ ధర్మాన్ని వ్యాపింపజేశాడు.

దీనిని బట్టి అశోకుని జీవితంపై బౌద్ధమత ప్రభావం ఎంత ప్రభావాన్ని చూపిందో చారిత్రక వాస్తవాలు రుజువు చేస్తున్నాయి. మరి అశోకుడు అనుసరించిన మార్గం నేటి తరాల వారికి ఆదర్శనీయం. ఎందుకంటే నేడు సమాజంలో అనేక వివాదాలు, జలవివాదాలు, నీటితగాదాలు, విభజనలు, దనికులు మరింత ధనికులుగా మారడం, పేదలు మరింత పేదలుగా మారడం. రాజకీయ ముఠాల దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఇలా ఒకటేమిటి నేటి సమాజంలో మానవుడు అల్లకల్లో జీవితం గడుపుతున్నాడు. మరి వీటికి స్పందించి ఎందరో అశోకులు పుట్టాలి? అందుకే బౌద్ధం నేటి సమాజానికి అవసరం. అందుకే బౌద్ధులు ఇలా అంటారు.

'ఇప్పుడు కావల్సింది రామరాజ్యం కాదు - అశోకరాజ్యం' అని

ఇక బౌద్ధ మత ప్రభావం కలిగి ఉన్న మరో వ్యక్తి బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. బౌద్ధ మతంలోని సాంఘీక సమానత్వమే అంబేద్కర్‌ను బౌద్ధ ధర్మం వైపు పయనింప చేసింది. గౌతమ బుద్ధుని జీవితచరిత్ర చదివి బుద్ధుని వర్ణనిరాకరణచే ఆకర్షితుడయ్యాడు. దళిత జాతి ఉద్ధరణద్యేయమే ఇతనిని విద్యాధికుని చేసింది. భారతరాజ్యంగా రచనలో సమున్నత స్థానం కల్పించింది. అంతేకాదు 1947 జూలై 22న ఇతని ప్రయత్నం వలనే భారత త్రివర్ణ పతాకంలో అశోక ధర్మచక్రం చేర్చబడింది అనే అభిప్రాయం ఉంది. అంబేద్కర్ ప్రపంచ మతాలను పరిశీలించి ప్రస్తుత సంఘ నిర్మాణానికి బుద్ధధర్మం మాత్రమే స్థిరమైనది. ఆదర్శవంతమైన పునాది కాగలదని నిశ్చయించుకున్నాడు. "ఎవరి ఉద్ధరణకు వారే యత్నించాలి" అన్న బుద్ధ నీతి అంబేద్కర్‌ను ఉత్తేజితున్ని చేసి అస్పృశ్యుల హక్కులకై పోరాడేట్లు చేసింది.

అన్ని మతాలను శోధించిన తరువాత బౌద్ధం తగిన మతమని ఎన్నుకుని 1956 అక్టోబర్ 14వ తేదిన 5 లక్షల మంది అనుచరులతో బౌద్ధధర్మాన్ని స్వీకరించాడు. ఇలా బౌద్ధ మత ప్రభావానికి ఆకర్షితుడై బుద్ధుడై జీవించాడు. దేశవ్యాప్తంగా బౌద్ధమత వ్యాప్తికి సామాన్య ప్రజల చెంతకు చేరడానికి అంబేద్కర్ గావించిన సామూహిక మతాంతీకరణ బౌద్ధానికి మరింత ప్రాచుర్యం కలిగించింది. కనుకనే బౌద్ధ ధర్మంలో అంబేర్కర్ స్థానం ఓ విశిష్టమైనదని చెప్పవచ్చు.ఇలా భారతదేశంలో ఎందరినో బౌద్ధమతం ప్రభావితం చేయగలిగింది.

### 3. తెలుగు సాహిత్యం - బౌద్ధమతం

తెలుగు సాహిత్యంలో బౌద్ధమతం, బౌద్ధగ్రంధాలు అన్న వెంటనే ప్రతిఒక్కరు అనేమాట తెలుగులో బౌద్ధగ్రంథాలు ఏమున్నాయి అని కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే తెలుగులో వందల కొద్దీ బౌద్ధగ్రంథాలు రావడమేకాక బౌద్ధమత సిద్ధాంతాలు తెలుగు సాహిత్యంపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం చూపిస్తున్నట్లు గమనించవచ్చు. ప్రాచీన తెలుగు సాహిత్య ఆవిర్భావమే బౌద్ధమత ప్రభావం అని చెప్పవచ్చు.

సాధారణంగా చరిత్ర, సాహిత్యం బొమ్మాబొరుసులాంటివి. ఇవి రెండు ఒకే నాణానికి ఉన్న రెండు ముఖాలు. కనుక అవి ఒక దానిపై మరొకటి ప్రభావం చూపించడం సహజం. ఈ నేపధ్యంలో తెలుగు సాహిత్యాన్ని రెండు భాగాలుగా చేసి మత దృష్టితో పరిశీలిద్దాం.

1. ప్రాచీన సాహిత్యం
2. ఆధునిక సాహిత్యం

### 4. ప్రాచీన సాహిత్యం - బౌద్ధమత ప్రభావం

ప్రాచీన సాహిత్యం ఎక్కువగా రాజుల ప్రోత్సాహంతో ఆనాటి రాజుల మనస్తత్వాల ఆధారంగా, సామాజిక అవసరాల దృష్యా కవులు రూపొందించారు. తెలుగు సాహిత్యం నన్నయ కాలం నుండి లిఖిత రూపంలో లభిస్తుంది అంటే దాదాపు 11వ శ॥. మరి ఆంధ్రదేశాన్ని పాలించి మొదటి రాజులుగా శాతవాహనులని చరిత్ర నిర్ధారిస్తుంది. అంటే ఆనాటికే తెలుగు ప్రజలు ఉన్నట్లు మనకు స్పష్టమవుతుంది. అదే సమయంలో శాతవాహనుల రాణులు బౌద్ధమతం పట్ల ఎంతటి ఆదరణ చూపారో వేరే చెప్పనవసరం లేదు. అంటే అప్పటికే బౌద్ధమతం బాగా ప్రచారంలో ఉండి ప్రజాధరణ పొంది ఉందని తెలుస్తుంది.

ప్రజల సంస్కృతిని తెలుసుకోవడానికి వాఙ్మయ ఆధారాలు ఒక భాగమే గానీ, వాటి ద్వారా పూర్తి చరిత్రను నిర్ధారించలేము. అశోకునికి పూర్వమే ఆంధ్ర ప్రజలు ఉన్నట్టు తెలుస్తుంది. ఆ తర్వాత అంటే క్రీ.శ. 6వ శతాబ్దానికే శాసనాలు ఉన్నప్పటికి 11వ శతాబ్దంలో మాత్రమే వాఙ్మయం లిఖిత రూపంలో వెలువడింది.

దీనిని బట్టి గమనిస్తే బుద్ధునికాలంలోనే ఆంధ్రులు బౌద్ధాన్ని ఆదరించినట్లు భావించవచ్చు. తమ భక్తి ప్రపత్తులను తెలిపే భాషగా శిల్పకళగా ఎన్నుకున్నారు. అంతేకాదు ఆనాడే 'ఆంధ్రం' రాజభాషయై ఉంటే నాగార్జునుని కాలంలోనే ఎన్నో వేల బౌద్ధ గ్రంథాలు వెలువడి ఉండేవి. అలాగే నాసిక్, నాగార్జున కొండ మొదలైన చోట్ల లభించిన దాన శాసనాలు తెలుగు ప్రజల బౌద్ధాభిమానాన్ని చాటుతున్నాయి. అయితే రాజుల అభిరుచికి అనుగుణంగా జౌన బౌద్ధ మతాల నుండి వైదిక మతాన్ని రక్షించడం ఒక కారణంగా ఆంధ్రసాహిత్యం ప్రారంభమైనట్లు స్పష్టంగా తెలుస్తుంది. అయితే బౌద్ధంలాగ కాక జైనమతం ఆత్మను, అంగీకరించి హిందూ మతాంతర్గతమైంది. ఇక ఆనాడు బౌద్ధానికి విరోధి మతాలు ఎక్కువ అయ్యాయి. కాబట్టి నాగార్జుని కృతులలో పరమత ఖండన చోటు చేసుకోవలసి వచ్చింది. నిజానికి ప్రజల్లో బౌద్ధం తెచ్చినటువంటి చైతన్యం ఏ యుగంలో ఏ మతం తెచ్చినట్లు కానరాదు. వేద విరుద్ధమైన బౌద్ధమత ప్రసక్తిరానప్పుడే భారతాంధ్రీకరణ ఉద్దేశం సఫలమౌతుందని భావించారు. కాబట్టి ప్రాచీనాంధ్ర సాహిత్యంలో బౌద్ధం ప్రభావాన్ని ప్రత్యక్ష ప్రభావం చూపినట్లు తెలుపడమనేది సాహసకార్యమే అవుతుంది.

అయితే ప్రజాజీవితంలో కలిసిపోయిన బౌద్ధం భౌతికంగా అస్తిత్వాన్ని కోల్పోయినా ప్రజల మనో క్షేత్రాలలో సారవంతమైన ధర్మ బీజమైనిలిచి వారి మాటలపై, జీవితాలపై ప్రభావం చూపుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రాచీన సాహిత్యంలో బౌద్ధమత ప్రభావం పరోక్ష వ్యతిరేక ప్రభావాలే కనిపిస్తాయి. ఈ వ్యతిరేక ప్రభావం బౌద్ధమత ఖండనగా, బౌద్ధారామాలను నిర్లక్ష్యం చేయడం కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే బౌద్ధరామాలు ఆదరణకు నోచుకోక అసాంఘిక కార్యకలాపాలకు నిలయమై లంజదిబ్బలుగా కూడా వ్యవహారంలో ఉన్నాయి అంటే ఆనాటి కాలంలో బౌద్ధ మతం పట్ల ఎంతటి వ్యతిరేక భావన ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆంధ్రుల ప్రథమకావ్యమైన ఆంధ్రమహాభారతంలో బౌద్ధ ప్రభావం పరోక్షంగా కనిపిస్తుదంటారు. తిరుమల రామచంద్ర, బులుసు వెంకటరమణయ్య, లలితవిస్తరము అనే అనువాద గ్రంథములో, అలాగే బౌద్ధ ప్రభావం వల్లనే భారతం చంపూకావ్యంగా రచించడమైందని తెలిపారు. అలాగే అరణ్య పర్వంలో ధర్మవ్యాధోపాఖ్యానంలో కులవృత్తిలో దోషం లేదని, మనసు పరిశుద్ధంగా ఉంటే పాపం రాదని చెప్పడంలో బౌద్ధ ప్రభావం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా భారతం మీద బౌద్ధ ప్రభావం ఉంది అనడంలో సందేహం లేదు.

పాల్కురికి సోమన వాఙ్మయానికి, తిక్కన నిర్వచనోత్తర రామాయనానికి ప్రేరణ బౌద్ధం నుండే గ్రహించారని కె. కమల్ నాథన్ (ది ఇమ్‌ప్యాక్ట్ ఆఫ్ బుద్దిజమ్ ఆన్ తెలుగు సొసైటీ) అనే గ్రంథంలో తెలిపారు.

ఇక క్రీ.శ. 1323లో ఏకామ్రనాథ కవి అన్యవాద కోలాహలంలో ఇలా అంటారు.

"బౌద్ధంబు వేద విరుద్ధంబు భవపాశ
బద్ధంబు దు:ఖ సమృద్ధమనియు
బౌద్ధంబు విగత విశుద్ధంబు సత్యాను
బద్ధంబు శాస్త్ర విరుద్ధమనియు
బౌద్ధంబు లోక నిషిద్ధంబు సంకృతావ
బుద్ధంబు దుష్కర్మ బద్ధమని యు
బౌద్ధంబు మోహ సంబద్ధంబు విజ్ఞాన
విద్ధంబు సాక్షద బద్ధమనియు

సాంఖ్య తొండడాది సమయంబు నిరసించి
భక్తుడై మహానుభావుడగుట!
యెఱుగరయ్య బౌద్ధులు.......

అని మొదట బౌద్ధుడై, పిదప శైవాన్ని గ్రహించిన శాక్యతొండని గూర్చి వివరించే సందర్భంలో బౌద్ధ దూషణ చేసినట్లు కనిపిస్తుంది.

ఆంధ్రసాహిత్యం వికాసంలో అప్పటి వరకు అజ్ఞాతంగాను, దూషణగాను ఉన్న బౌద్ధం శ్రీనాధుని కాలానికి దశావతార వర్ణనలు చోటుచేసుకుంది. అంటే బుద్ధుని విష్ణువు అవతారలలో చేర్చి బౌద్ధం వైదిక మతాంతర్గతమని ప్రచారంచేశారనే వాదన బలంగా ఉంది. శ్రీహర్షుని శృంగార నైషదం, జయదేవుని గీతగోవిందాలలో దశావతార వర్ణనలే ఆధారం.

నిన్దసి యజ్ఞవిధేరహహ శ్రుతి జాతం
సదయ హృదయ దర్శిత పశుఘాతమ్
కేశవ! ధృత బుద్ధ శరీర! జయ జగదీశ! హరే
(గీత గోవిందం)

అలాగే శ్రీనాధుని శృంగార నైషదంలో స్తుతిరూపమైన బుద్ధ అవతార వర్ణన కనిపిస్తుంది.

"ఏక యద్వయవాది త్రయీ విదూర
యవన గీత చతుర్విధ ఖ్యాతి మార్గ
పంచబాణారి షడభిజ్ఞ పరమ పురుష
బుద్ధ! సంవత్సరంపరావృద్ధి యొసగు"
"బుద్ధ నీ గట్టి హృదయ సంపుటము దాకి
కుంఠితములయెఒ్య మరునంప కోలలెల్ల
మొద్దువోయి కదా యిపుడు మురవిరోధి
యలరులెల్లను వర్తులాస్యంబులయ్యె"

అని మార విజయాన్ని వర్ణించాడు శ్రీనాధుడు. శ్రీనాధునికాలానికి బౌద్ధ స్వరూపమే మారిపోయింది. ఇంకా రాయలకాంలో దశావతార వర్ణనల బుద్ధుడు కనిపిస్తాడు. నంది తిమ్మన పారిజాతాపహరణం(1-50)లోను, తెనాలిరామకృష్ణుని పాండురంగమహాత్మ్యంలోనూ కనిపిస్తుంది.

ఇలా ప్రాచీనాంధ్ర కావ్యాలలో కనిపించే బౌద్ధమత వ్యతిరేక ప్రభావాన్ని చూశాం. క్రీ.శ. 16 వ శతాబ్ది నాటికి మనదేశంలో బౌద్ధం పూర్తిగా పూర్వవైభవాన్ని కోల్పోయింది. బౌద్ధమతం కావ్య గౌరవానికి నోచుకోలేదు. అయితే బౌద్ధంలోని మంచి గ్రహించి వెలసిన పరోక్షగ్రంథాలు లేకపోలేదు. అటువంటి వాటిలో శ్రీపతి భాస్కరకవి. చిత్తశతకం, దీనిలో విగ్రహారాధన కన్నా, జనుల మెప్పించడానికి శ్రమించడం కన్నా, తననుతాను తెలుసుకో అంటాడు. అలాగే మడికి సింగన వాశిష్టరామాయణం, వేమన పద్యాలలో కావలసినంత బౌద్ధ సారంకనిపిస్తుంది.

"పుణ్యమనగనేమి పురుషుని కర్మమే అని నిర్దేశించుటలోను అలాగే
మాల యంటనుచు మఱి నీళ్ళమునిగిరి
మాలకర్మచేత మాలడాయె
ఏల తెలియలేరో? యీ నరపశువులు"

అని కర్మచేతనే జాతులను నిర్దేశించాలిగాని జన్మచేతకాదని తెలియజేస్తాడు అపవాదం. ఆంధ్రదేశంలో బౌద్ధం వ్యాప్తిలో ఉన్నప్పుడు ఆంధ్రభాషకు సాహిత్య సంపదలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆంధ్ర సాహిత్యమే బౌద్ధాది మతాల నిరసనకై ప్రారంభమైంది.

## 5. ఆధునిక సాహిత్యం - బౌద్ధమత ప్రభావం

ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆ సాహిత్యంలోని వస్తువు పౌరాణికం, భాష గ్రాంథికం, ఛందస్సు పద్యాలు నేపథ్యం వైదిక మతోద్ధరణ. అలాగే ఆధునిక సాహిత్యాన్ని పరిశీలిస్తే వస్తువు సామాజిక, భాషా వ్యవహారం, ఆధునిక సాహిత్యానికి కేంద్ర బిందువు సమాజంలోని సంఘటనలు. అప్పటివరకు ప్రజల్లో అంతరవాహినిగా ఉన్న బౌద్ధధర్మం ఆధునికులను ఎంతగానో ప్రభావితం చేసింది. అంతేకాక సాహిత్య గౌరవాన్ని పొందింది. ఆధునిక యుగం వరకు పీడిత వర్గం ఒకటున్న సంగతి ఆంధ్ర సాహిత్యానికి తెలియదు.

కార్మిక, కర్షక వర్గాలతో పాటు వర్ణవ్యవస్థతో మధింపబడిన సంఘంలో అస్పృశ్యత, వర్ణభేదం వెలుగులోకి వచ్చింది. వారి కష్టాలు గాధలు కవుల మదిని కరుణతో నింపాయి. ప్రాచీన కాలంలో వర్ణవ్యవస్థను నిరసించిన చారిత్రక పురుషుడు ఒక్క బుద్ధుడే. ఆనాడు బుద్ధుడు ప్రదర్శించిన సమానతను ఆధునిక యుగంలో కవులు తమకావ్యాలలో కీర్తించారు. సాహిత్యంలో వచ్చిన మార్పులు కవులకు స్వతంత్ర ఇతివృత్తాలలో రచనలు చేశారు అయితే తాము బౌద్ధులమని చెప్పుకోలేరు. అయితే తమ మనస్సుకు నచ్చింది, సమాజం మెచ్చింది, ప్రజా శ్రేయస్సు కలిగించే వస్తువే వారి రచనలో చోటుచేసుకుంటాయి.

ఆధునిక కాలంలోని సాహిత్యాన్ని పరిశీలిస్తే బౌద్ధసాహిత్య ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. మానవత్వాన్ని మధుర సందేశంగా వినిపించే ప్రతి కావ్యానికి బౌద్ధమత సిద్ధాంతాలే నేపథ్యాలు అయ్యాయి. ఆధునిక కాలంలో బుద్ధుని చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని రాసిన మొట్టమొదటి కవులుగా చెప్పుకోదగినవారు తిరుపతి వేంకటకవులు వారి "బుద్ధచరిత్ర" (1902) ఈ గ్రంథం బుద్ధ మత సిద్ధాంతంతో నిండి ఉంటుంది. పోలవరం జమిందారు కోరిక మేరకు ఆర్నాల్డ్ కవి కృత 'లైట్ ఆఫ్ ఏషియా' అనే చరిత్రను కావ్యంగా అనువదించి ఇతివృత్త స్వీకరణలో నవ్యతను చూపి తధానంత కవులకు మార్గదర్శకులయినాడు.

ఆ తరువాత పింగళి - కాటూరి రాసిన 'సౌదరనందనం' ఇలా అనేక గ్రంథాలు ఆంగ్ల భాషా పరిచయం వలన బుద్ధుని జీవితచరిత్రలను బౌద్ధ మత సిద్ధాంతాలతో పరిచయం ఏర్పడిన కవుల దృష్టిని బౌద్ధధర్మంవైపు మళ్ళించాయి.

ఆ తరువాత బౌద్ధమత సంబంధ ప్రథమ వచన గ్రంథం. ఓ.వై దొర సామయ్యగారి 'గౌతమబుద్ధచరితలు' ఆలాగే చిలకమర్తివారి 'సిద్ధార్థ చరిత్రము', 'బుద్ధచరిత్ర', శ్రీబేతపూడి లక్ష్మీకాంతారావుగారి అశోకచరిత్ర (1910), చీనాదేశపు చరిత్ర(1912), ఆ తర్వాత పెమ్మరాజు వెంకటచలపతిరావు, పాలపర్తి రామమూర్తి, పి.పి. నంజుండప్ప, కాంచనపల్లి కనకమ్మ మొదలైనవారు గౌతమబుద్ధ జీవిత చరిత్రలో ప్రచురించారని నిడదవోలు వేంకటరావు వివరించారు. (1956:29)

శ్రీకిళాంబి రంగాచార్యులు, బౌద్ధవాఙ్మయ (బహ్మాశ) దుగ్గిరాల బలరామ కృష్ణయగార్ల బౌద్ధ వాఙ్మయ పరిశోధన, శ్రీమల్లంపల్లి సోమశేఖర శర్మ, శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిల చారిత్రక పరిశోధనలు బౌద్ధానికి మరింత ప్రచారాన్ని కలిగించాయి. ఇలా బౌద్ధ సంబంధ రచనలేకాక భారతి, ఆంధ్రపత్రిక మొదలైన సాహిత్య పత్రికలు బౌద్ధ సాహిత్య వికాసానికి దోహదం చేశాయి. అలాగే నేడు అనేక పత్రికలు బౌద్ధమత వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. ఉదా॥ రసరేఖ. దీనిలో ప్రముఖ బౌద్ధ పరిశోధకులు పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తూ ప్రజల్ని చైతన్యవంతం చేస్తున్నారు.

అలాగే కావ్యాలేకాక లలిత విస్తరము, బుద్ధచరిత్ర, బోధి సత్యవన, కల్పలత, జాతకకథగుచ్ఛము, ధమ్మపదానువాదములు, ధర్మచక్రము, అశోక ధర్మచక్రము, వాఘీరా, నలందా, సేవాసదనము, వంటి నవలలు, భీమాభిఖణి, దేవానాంప్రియ, గౌతమబుద్ధ, విశ్వాంతర, కాంచనమాల వంటి నాటకాలు ఇలా వందల కొలది బౌద్ధ రచనలు వెలువడి ఆంధ్ర సాహిత్యంలో బౌద్ధాన్ని ఒక ప్రత్యేక శాఖగా విలసిల్లజేశాయి.

ఆధునిక సాహిత్యంలో ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు కనిపిస్తాయి. నవ్యాంధ్ర సాహిత్య యుగకర్త గురజాడ అప్పారావు రచనలలో మానవతావాదం కనిపిస్తుంది.

ఎల్లలోకము లొక్కయిల్లై, వర్ణ భేదము లెల్లకల్లై
వేలనెరుగని ప్రేమ బంధము వేడుకలు కురియ
మతము లన్నియు మాసిపోవును, జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖంబులన్నవి, యవని విలసిల్లున్
-(ముత్యాలసరములు 17,18)

అలాగే ప్రాచీన కాలంలో భారతదేశంలో బౌద్ధం అంతరించడాన్ని గురజాడ ఇలా స్పందించారు.

"సజీవమైన విశ్వాసంగా బుద్ధుడు ఉపదేశించినది
నిజమైన ప్రేమ, మానవుని పట్ల ప్రేమ
బౌద్ధం అణగదొక్కపడినప్పుడు భారతదేశం
మతం పరంగా ఆత్మహత్య చేసుకుంది" - అని అంటారు.

అలాగే తిరుపతి వేంకటకవుల కాలం నుండి గౌతమ బుద్ధుని గూర్చిన సరైన అవగాహన కనిపిస్తుంది.

బుద్ధరూపంబు చేత ప్రబుద్ధుడవయి
జనులందత్కాల దుర్మత శ్రవణ మనన
దుష్టులను శిష్టుల నొనర్చి పుష్టి జగతి
కొసగు నీకు నమస్కారమో మహాత్మ - అని (సుత్తనిపాతము (వాస్ఠసుత్త -61)
"జీవుల హింసించుట పా
పావహ మది తగదు మానవాళి కనుచు బు
ద్ధావతరణ మొనరించితి
కేవల! కలివేల నింబగిరి నరసింహా" అని
".... ఇంపుదళు కొత్తు కరుణ వ్యాపింపజేసిన ....."
"సత్య గుణ రాశి సన్యాసి సంభవించె
బిదపనని బుద్ధరూపంబు వెల్లడించు"
...................................................
'రాగ రాహిత్యమే సుఖ ప్రకరణ మ'నియు
అని గౌతమ బుద్ధుడుపదేశించిన ధర్మసారాన్నే గానం చేశాడు.

ఆధునిక కవులు బౌద్ధం చేత ప్రత్యక్ష ప్రభావితం చేసే రచనలు చేసినవి అనేకం. ఎక్కువ ఆధునిక కావ్యాలలో గాంధీ మహాత్మునిలో గౌతమబుద్ధుని దర్శించడం కనిపిస్తుంది

"హింసమాను మనెడి యింపగు మాటను
బుద్ధితోడ తెలిపె బుద్ధుడపుడు
దాని పెంపు ధర్మమయుడు క్రీస్తు
ఆచరింప చూపె యవని గాంధి"

'నాగార్జునసాగరమం' కావ్యంలో ప్రముఖ కవి, విమర్శకులు, గాయకులు సి.నారాయణరెడ్డిగారు ఇలా అంటారు.

నేను బౌద్ధమతానుయాయిని

 ISSN 2394-6385 (Print)
ISSN 2394-6393 (Online)

కా నైనను నాదు కళా
జీవితమ్ము బుద్ధ మూర్తి
చిత్రణకే అంకితమ్ము (35) అని ప్రతిన బూనుతాడు.

ఈ కావ్యంలో పద్మదేవుని నోట తన గొంతును వినిపించిన కవి, సౌందర్య మెలికించు కళకు శాంతిమై ప్రవహించే బౌద్ధ ధర్మాన్ని చూసిన పోలిక అనితరసాధ్యం.
కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి, ఉదయశ్రీ(1944) లో ఇలా అంటారు.

బుద్ధదేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీలోన చచ్చినేమి?
అందమును హత్యచేసెడి హంతకుండ!
మైలపడి పోయెనోయి! నీ మనుజ జన్మ!! (పుట :65)

అని నిందించి, కోయబోకుము మాకుత్తుకలను అని వేడుకొన్నాయట ఆ పుష్పాలు, నోరు లేని పూల బాలలకొక జీవితాన్ని కల్పించి, వారి ఆవేదనలను అక్షర రూపంలో వివరించి కరుణతో కన్నీరు కార్చిన కవి కరుణశ్రీ.

అలాగే ధాశరధి తన మహాబోధి (మూడవ ముద్రణ 1963) లో ఇలా అంటారు.

దయకు సాగరమ్ము, ధర్మమునకు గని
సర్వమునకు ఠావు, శాంతమునకు
పుట్టినిల్లు, సత్వమున కాలవాలమ్ము
జ్ఞానమ్మునకు తాన కాణయాచి

అయిన 'బుద్ధుని జననాంతర గాథావళి వినగానే, అతని త్యాగభావం, సర్వమానవ సౌభ్రాత్ర విశ్వశాంతి భావాలు ఎదనాక్రమిస్తాయి' అని మహాబోధి కర్త, శాంతి కాముకుడైన దాశరథి అభిప్రాయం.

వర్ణభేదాన్ని నిరశించిన జాషువా కవి వర్గరహితమైన బౌద్ధాభిమాని అవడంతో ఆశ్చర్యం లేదు. తాను రాసిన నాగార్జుసాగర్, కాందిశీకుడు మంచి బౌద్ధకవులే కాక బుద్ధుని గూర్చి అనేక ఖండికలు కూర్చి బౌద్ధాభిమానాన్ని చూపారు.

కాంధిశీకుడు కావ్యంలో ఇలా అంటారు. పూర్వం బుద్ధుని సన్నిదిలో సర్పరాజు తల మీద కప్పులు వసించాయి కదా, అని ప్రారంభించి అహింస సమానతలను వివరించి
చితుక దహింసా జ్యోతి
ర్లతిక ధరాచక్రమెల్ల లయమైన సమం
చిత బుద్ధ దివ్యచరణ
ద్వితయము మన్నించి యున్న దిగ్దేశములన్

అని నిర్ధారించింది. పునుక సందేశం విన్న కాందిశీకుడు మనసు మార్చుకొన్నాడు.అలాగే నేతల ప్రతాప్ కుమార్ తన బౌద్ధభాషితాలు అనే గ్రంథంలో ఇలా అంటారు. బుద్ధుని గురించి ప్రస్తావిస్తూ,

'దూరంగా పోయింది దగ్గరయ్యేటందుకే
దగ్గరగావచ్చింది చేరువయ్యేటందుకే
కుటుంబానికి దూరమవ్వలేదు బుద్దుడు
ప్రపంచానికి చేరువయ్యాడు అంటే (పుట:2)

అలాగే బౌద్ధమతాన్ని - అంబేద్కర్‌ను జోడిస్తూ ఇలా అంటాడు.

చెరువులన్నీ పూడ్చేస్తే చేప ఎక్కడ మసలుతుంది
చెట్లన్నీ కూల్చేస్తే పక్షి ఎలా బతుకుతుంది
వలస పక్షిపై అందుకే జల సరస్సు తవ్వాడ
అంబేద్కర్ మళ్ళీ బౌద్ధాన్ని బతికించాడు

అని బౌద్ధ మతంపట్ల, అంబేద్కర్ పట్ల తన విశ్వాసాన్ని తెలిపారు. అలాగే మునిసుందరం చారిత్రక పౌరాణిక రూపకాలాల్లో బుద్ధుని జీవితంతో కూడిన 'ఏ వెలుగులకీ ప్రస్థానం' అనే చారిత్రక నాటికను రాశారు. అలాగే గూటంస్వామి యశోధర (వైఫ్ ఆఫ్ గౌతమబుద్ధ) అనే విశిష్ట నవలను రాశాడు. అలాగే పువ్వాడ తిక్కన సోమయాజి అమ్రపాలి అనే పద్యకావ్యాన్ని రాశారు.ఇలా నేడు ఆధునిక సాహిత్యంలో అన్ని ప్రక్రియలలోను బుద్ధునికి సంబంధించి, బౌద్ధం వంతం గురించి ప్రస్థావనలో అనేక కోణాల్లో వ్యక్తం చేస్తూ ఎందరో కవులు ఎన్నో రచనలు చేశారు. ఇలా ఆధునిక సాహిత్యంలో వెలువడే అన్ని ప్రక్రియలలోను బౌద్ధ మత సిద్ధాంతాలు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో మానవత్వాన్ని ప్రబోధించే ప్రతి సన్ని వేశంలోను బౌద్ధమతం దర్శనమిస్తుంది.

భారతీయులంతా బౌద్ధలైతే శాంతియుత సహజీవనమెంతో తేలిక. బుద్ధుని అసాధారణ త్యాగశీలత అనన్యజ్ఞాన సముపార్జన ఆఖరి శ్వాసదాకా సాగించిన చేసిన విశిష్టధర్మ ప్రభోదాలు మరవలేనివి. కవికోకిల మహాకవి జాషువా గారు బౌద్ధ సాహిత్య శిల్పకళా వైశిష్ట్యాన్ని మనల్ని బౌద్ధం వైపు ఆకర్షించే సుప్రసిద్ధ పద్యకావ్యంలో ఇలా అంటారు.

"దర్శింపగలవు గౌతమ బుద్ధ దేవుని, ప్రాచీన భారత శిల్పంబు నందు
సాధింపగల వహింసా మంత్ర రాజంబు, శాక్య సింహుని కాలి జాడ యందు
తెలుసుకోగలవు బౌద్ధుల సాహితీ సేవ, అమరసింహుని కవిత్వంబు నందు
వీక్షింపగలవు కపిలవస్తు నగరంబు, నాశన దేవ్య దీనంబునందు
ండు వేలేండ్ల క్రింద నిద్రించుచున్న, మౌర్య రాజుల విపుల సామ్రాజ్య చరిత
యేకరువుపెట్టు ప్రకృతి యందాకళించి, వెచ్చ వెచ్చని కన్నీరు విడువగలవు".

ఆధునిక తెలుగు సాహిత్యంలో బౌద్ధ కవులలో ఒకే కావ్యం రాసినవారు, రెండు నుండి పది కావ్యాలు రాసినవారే గాక కావ్యాలతో పాటు అనేక ఖండికలు రాసిన కవులు అనేకులు ఉన్నారు. బౌద్ధ సంబంధ పరిశోధనా వ్యాసాలు వెలువరించారు.

బౌద్ధమత పరిశోధకులలో పేర్కొనదగిన వారు అన్నపరెడ్డి వేంకటేశ్వర రెడ్డిగారు. వీరి రచనలలో, వ్యాసాలలో బుద్ధుని జీవితాన్ని, ఆశయాలను చారిత్రక ఆధారలతో విశేషమైన రచనలు చేశారు. అందుకే వీరిని 'అన్నపరెడ్డి బుద్ధఘోషుడు' అని పిలుస్తారు. అలాగే ప్రముఖ దళిత కవి కత్తి పద్మారావుగారు బౌద్ధమతంలోని వివిధ కోణాలను ఆధునిక దృష్టితో దర్శిస్తూ బౌద్ధ దర్శనం అనే గ్రంథంగా రూపొందించారు. అలాగే వీరు నేటి సమాజానికి బౌద్ధమత అవసరం ఎలాంటిదో ప్రముఖుల జీవితచరిత్రల్లోని బౌద్ధమత ప్రభావాలను విశ్లేషిస్తూ అనేక పత్రికలలో పరిశోధన వ్యాసాలు రాశారు. అలాగే ఇండియన్ హైకూ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తలతోటి పృధ్వీరాజ్ హైకూలకు పెట్టింది పేరు. ఈ హైకూ ప్రక్రియలో కూడా బౌద్ధమత ప్రభావంతో 'సంబోధి' అనే ఒక హైకూ సంపుటిని వెలువరించి బౌద్ధమత ఆవశ్యకతను దానిలోని చైతన్యాన్ని వివరించారు. డి. నటరాజ్ రాసిన 'బుద్ధధర్మం - సత్యశోధన' అనే వ్యాస సంపుటి ఇలా ఎందరో కవులు బౌద్ధ మత విశిష్టతను కొనియాడారు.

నేడు విశ్వవిద్యాలయాలలో కూడా బౌద్ధంపై అనేక పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. ఇలా తెలుగు భూమిలో బౌద్ధం ఉత్తరాది తీర ప్రాంతం నుండి రాయల సీమలోని నందలూరు వరకు తూర్పున ఘంటసాల నుండి వాయువ్యాన దూని కట్ట వరకు వందలాది బౌద్ధ క్షేత్రాలు వెలుగు చూసాయంటే తెలుగు ప్రజలు బౌద్ధమతం పట్ల ఎలాంటి ఆధరణను కలిగి ఉన్నారో వేరే చెప్పనవసరం లేదు. ఈ విధంగా దక్షిణ భారతదేశంలో ఆంధ్రదేశం గొప్ప బౌద్ధకేంద్రంగా విలసిందని చెప్పడానికి ఈ బౌద్ధ క్షేత్రాలే నిదర్శనం. ఇలా భారతీయ సంస్కృతీ, వాస్తు శిల్పకళకు బౌద్ధం చేసిన సేవలు ఎనలేనివి.

ఈ విధంగా బౌద్ధ సాహిత్యాన్ని పరిశోధించి ఎన్నో చారిత్రక సత్యాలను బయలు పరచి బౌద్ధాన్ని పరిపుష్టం చేయటమేకాక ప్రజలను చైతన్య వంతం చేశారు కవులు, ప్రస్తుత సమాజంలో అత్యంత వేగంగా ప్రజల హృదయంలో స్థానం సంపాదించి, ఆలోచింపజేస్తోంది.

నేడు ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు హింసాతత్వం పెచ్చుపెరిగి రక్తపాతం రాజ్యమేలుతున్న ఈ తరుణంలో అహింసా పరమధర్మంగా విశ్వశాంతిని కాంక్షించే బౌద్ధమత ఆవశ్యకత, అవసరం నేటి సమాజానికి ఎంతైనా ఉంది. దాని అనేక కోణాలలో, ప్రక్రియల్లో రచనలు చేసి ప్రజలను ప్రగతి పథంవైపు మళ్ళించాల్సిన బాధ్యత కవులమీద, సామాజిక వేత్తలపై ఉంది.

**ఆధార గ్రంథాలు**

[1] ఆధునికాంధ్ర కవిత్వంపై బౌద్ధమత ప్రభావం - డాక్టర్ రాయదుర్గం విజయలక్ష్మీ
[2] తెలుగు నాట బౌద్ధ క్షేత్రాలు - డాక్టర్ వీపూరి సుదర్శన్
[3] మధుర భారతి - జంధ్యాల పరదేశ్య బాబు
[4] భావనా తరంగణి - జక్కంపూడి మునిరత్నం
[5] బౌద్ధ సుభాషితాలు - నేతల ప్రతాప్ కుమార్
[6] రసరేఖ పత్రికలు (ద్వైమాసిక పత్రిక)-2009 మార్చి/ఆగస్టు, 2012 జూలై/ఆగస్టు - 2012 సె ప్టంబర్/డిసంబర్
[7] జాషువా ఖండకావ్యాలు



డా. విస్తాలి శంకరరావు, ఆచార్యులు, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై. 15 సంవత్సరాల అనుభవం, పరిశోధనారంగంలో 13 సం. అనుభవం. అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధక వ్యాసాలు ప్రచురించారు. 14 పుస్తకాలు వెలువరించడం జరిగింది. జానపద, విమర్శ వంటి రంగాలలో అభిరుచి.